


జాతీయస్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు నూజివీడు విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

జాతీయస్థాయి అండర్ 19 బాస్కెట్ బాల్ పోటీలకు నూజివీడు పట్టణానికి చెందిన ఇటర్ విద్యార్థి విద్యార్థి ఎమ్‌డి మస్తాన్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పలువురు అధ్యాపకులు, పురప్రముఖులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పిఇటి వాకా నాగరాజు ఆదివారం మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా మదనపల్లెలో గత నెల 29, 30, 31 తేదీల్లో నిర్వహించిన పోటీల్లో విజయం సాధించి, రాష్ట్ర టీముకు మస్తాన్ ఎంపికయ్యాడన్నారు.


ఎంపికైన విద్యార్థి మస్తాన్

నిర్వాసితులంటే ఇంత నిర్లక్ష్యమా..!

- పోలవరం నిర్వాసితుల పట్ల ప్రభుత్వతీరు దారుణం
- నాలుగున్నరేళ్లు గడిచినా అతీగతీ లేని సిఎం హామీలు
- పునరావాసం, భూముల పరిహారం జనవరిలోనైనా ఇస్తారా
- ప్రతిఏటా వరదలకు కొండలు, గుట్టలపైకి నిర్వాసితులు
- కేంద్రం నుంచి నిధులు రాబట్టడంలో జగన్ సర్కార్ విఫలం
- నేడు ఏజెన్సీలో సిపిఎం ప్రజారక్షణ భేరి బస్సుయాత్ర

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

పోలవరం నిర్వాసితుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నాయి. అధికారంలోకొచ్చి నాలుగున్నరేళ్లు గడిచినా నిర్వాసితులకిచ్చిన ఏ ఒక్కహామీ జగన్ సర్కార్ అమలు చేయని పరిస్థితి నెలకొంది. ప్రతిఏటా వరదల సమయంలో సిఎం రావడం ఏదో ఒకటి చెప్పడం.. తర్వాత పట్టించుకోకపోవడం పరిపాటిగా మారిపోయింది. కాఫర్‌డ్యాం నిర్మాణంతో చిన్నపాటి వరదకు సైతం గ్రామాలు ముంపునకు గురికావడంతో, పునరావాస కేంద్రాలకు, కొండలు, గుట్టలపైకి వెళ్లి తలదాచుకునే దుస్థితి నిర్వాసితులకు తీసుకొచ్చారు. కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో దాదాపు 107 నివాసిత ప్రాంతాల్లో 20 వేలకు పైగా కుటుంబాలున్నాయి. నిబంధనల ప్రకారం ప్రాజెక్టులో సర్వం కోల్పోతున్న నిర్వాసితులకు పరిహారం అందించి తరలించిన తర్వాత ప్రాజెక్టు నిర్మాణ పనులు పూర్తిచేయాలి. పోలవరం ప్రాజెక్టు విషయంలో మాత్రం అందుకు విరుద్ధంగా సాగుతోంది. నిర్వాసితులకు పరిహారం ఇవ్వకుండా పోలవరం ప్రాజెక్టులో ప్రధానమైన కాఫర్‌డ్యాం నిర్మాణం పూర్తిచేశారు. దీంతో కొద్దిపాటి గోదావరి వరదకు సైతం నీరు ఎగదన్ని కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో గ్రామాలు ముంపునకు గురవుతున్నాయి. 2022 జులైలో విరుచుకుపడిన వరదలకు 95 నివాసిత ప్రాంతాలు ముంపుబారిన పడగా 20 వేల కుటుంబాలు వరదల్లో చిక్కుకుని నెల రోజులకు పైగా తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దాదాపు ఎనిమిదిసార్లు ఇళ్లు నేలమట్టమయ్యాయి. దెబ్బతిన్న ఇళ్లకు రూ.పదివేలు చొప్పున పరిహారం ఇస్తామని చెప్పిన ప్రభుత్వం ఈపాటికి వరదలు వచ్చినా కూడా 1280 ఇళ్లకు సంబంధించి పరిహారం ఇవ్వలేదు. దీంతో నిర్వాసితులు జిల్లా కలెక్టరును నిలదీసే పరిస్థితి నెలకొంది. 2023 ఆగస్టులో వచ్చిన చిన్నపాటి వరదకు 45 నివాసిత ప్రాంతాలు ముంపుబారిన పడ్డాయి. 13,764 కుటుంబాలు వరద బాధితులుగా మారి తీవ్ర ఇబ్బందులుపడ్డారు. కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో 12 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి 4,275 మందిని అధికారులు తరలించారు. మిగిలిన 9,489 కుటుంబాలు కొండలు, గుట్టలపైనే తలదాచుకున్నాయి. ప్రతియేటా ఇదే పరిస్థితి నెలకొన్నప్పటికీ నిర్వాసితుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తోంది.

సిఎం హామీలు.. 'నీటి' మూటలు..!

తాము అధికారంలోకి వస్తే నిర్వాసితులను ఆదుకుంటామని, పునరావాస ప్యాకేజీ రూ.6.37 లక్షలకుగాను రూ.పది లక్షలు ఇస్తామని ప్రతిపక్ష నాయకుడి హోదాలో జగన్ హామీ ఇచ్చారు. అంతేకాకుండా 2006కు ముందు సేకరించిన భూములకు అదనంగా రూ.ఐదు లక్షల చొప్పున ఇస్తామన్నారు. అధికారంలోకొచ్చి నాలుగున్నరేళ్లు గడిచినా ఇప్పటి వరకూ అతీగతీలేకుండా పోయింది. 2022 ఆగస్టులో వరద వరదబాధితుల పరామర్శకు వేలేరుపాడు మండలం కన్నాయిగుట్ట గ్రామానికి సిఎం వెళ్లారు. ఆ సందర్భంలో 2022 అక్టోబర్ నాటికి 41.15 కాంటూరు పరిధిలోని వరద బాధితులకు పూర్తిస్థాయిలో పరిహారం ఇస్తామని హామీ ఇచ్చారు. 45.75 కాంటూరు బాధితులకు మాత్రం కేంద్రం సాయం చేయాల్సి ఉందని తెలిపారు. కానీ సిఎం ఇచ్చిన హామీ నెరవేరలేదు. నిర్వాసితులకు పరిహారం ఇవ్వకుండా కాలయాపన చేశారు. 2023 ఆగస్టులో మరోసారి విరుచుకుపడిన వరదలకు పోలవరం నిర్వాసితులు విలవిల్లాడారు. మళ్లీ కుక్కునూరు మండలం గొమ్ముగూడెం గ్రామానికి వరదబాధితుల పరామర్శకు సిఎం వెళ్లారు. సిఎం వస్తుండటంతో గొమ్ముగూడెం గ్రామానికి చెందిన 245 కుటుంబాలకు మాత్రమే రూ.6.37 లక్షల చొప్పున పరిహారం బ్యాంకు ఖాతాల్లో జమచేశారు. సిఎం ఇచ్చిన హామీ ప్రకారం ఇవ్వాల్సిన రూ.పది లక్షల పరిహారం ఇవ్వలేదు. 41.15 కాంటూరు పరిధిలో నిర్వాసితులకు 2024 జనవరి నాటికి పరిహారం ఇస్తామంటూ మాటమార్చారు. తాము ఇచ్చిన హామీ ప్రకారం పునరావాస ప్యాకేజి రూ.పదిలక్షలు, భూములకు ఇస్తామన్న రూ.ఐదు లక్షల పరిహారం జనవరి, ఫిబ్రవరిలో ఇస్తామని చెప్పారు. అప్పుడైనా ఇస్తారో, లేదో తెలియని పరిస్థితి నెలకొంది. లైడార్ సర్వే సైతం తప్పుల తడకగా వచ్చిందని, చాలా గ్రామాలు చిన్నపాటి వరదకు మునిగిపోతున్నా 45.75 కాంటూరులో చేర్చారని, ఆయా గ్రామాలను 41.15 కాంటూరులో చేర్చాలని నిర్వాసితులు అడిగినా సిఎం మాట దాటవేశారు. 18 ఏళ్లు నిండిన యువతకు పరిహారంపై ప్రభుత్వం నోరుమెదపడం లేదు. నిర్వాసితులకు ఇళ్ల నిర్మాణం పూర్తిచేయలేదు. నిర్వాసితల కాలనీలో మౌలిక వసతులు పూర్తిచేయకుండా వదిలేశారు. భూమికి భూమి చాలా మందికి అందలేదు. కొన్నిచోట్ల ఇచ్చినప్పటికీ ఎందుకూ పనికిరాకుండా ఉంది. గడిచిన నాలుగున్నరేళ్లుగా నిర్వాసితుల పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు అత్యంత దారుణంగా ఉందని చెప్పొచ్చు. వచ్చే ఎన్నికల్లో నిర్వాసితుల సమస్యలే రాజకీయ పార్టీల ప్రధాన ఎజెండాగా మారితే తప్ప న్యాయం జరిగే పరిస్థితి ఉంటుందని చెప్పడంలో ఎలాంటి సందేహమూ అక్కర్లేదు. ప్రజాసమస్యలను ఎన్నికల ఎజెండాగా మార్చేందుకు సిపిఎం చేపట్టిన ప్రజారక్షణ భేరి బస్సుయాత్ర సోమవారం ఏజన్సీప్రాంతంలో పర్యటించనుంది.


గోదావరి వరదలు ముంచెత్తడంతో కొండపైన గుడారాలు ఏర్పాటు చేసుకున్న పోలవరం ప్రాజెక్టు ముంపు గ్రామాల ప్రజలు (ఫైల్‌ఫొటో)



నీట మునిగిన నిర్వాసితుల ఇళ్లను పరిశీలిస్తున్న సిపిఎం నేతలు (ఫైల్)


రైతుల సమస్యలు తెలుసుకుంటున్న ఎంపీ కోటగిరి

పంట నష్టపోయిన రైతులను ఆదుకుంటాం : కోటగిరి

ప్రజాశక్తి - చింతలపూడి

వర్షాభావంతో వరిపంట దెబ్బతిన్న రైతులకు ప్రభుత్వం నుంచి సహాయం అందేలా కృషి చేస్తామని ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్‌బాబు తెలిపారు. మండలంలో పాతచింతలపూడి, మల్లయ్యగూడెం, పోతునూరు తదితర గ్రామాల్లో సాగునీరు లేక ఎండిపోయిన వరి పంటలను పరిశీలించారు. రైతులను, అధికారులను వివరాలు అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. వరిపంటలు ఎండిపోతున్నాయని, పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు ఎంపీ వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. అదే విధంగా పాతచింతలపూడి వద్ద పెద్ద చెరువు, మల్లయ్యగూడెం చెరువు, ఆంధ్రా కాలువలు పూర్తిగా పూడిపోయాయని తెలిపారు. చెరువుల ఆక్రమణలు తొలగించి, ఆంధ్రా కాలువ చెరువు పూడిక తీయిస్తే వర్షం నీరు వృథాకాకుండా నిల్వ చేసుకోవచ్చని తెలిపారు. వర్షాభావం సమయంలో రైతులకు ఇలాంటి చెరువులు ఎంతోకొంత ఉపయోగపడతాయన్నారు. పుష్కలంగా పంటలు పండే పరిస్థితి కనిపించటం లేదని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ చింతలపూడి మండలంలో 15 వేల ఎకారాలకు ఇప్పటి వరకూ సుమారు మూడు వేల ఎకరాల వరకూ వరిపంట నష్టపోయినట్లు గుర్తించామన్నారు. వర్షల్లేక పంటనష్టపోయిన రైతులు రైతు భరోసా కేంద్రంలో నమోదు చేయించుకోవాలన్నారు. పంట నష్టపోయిన రైతులకు ఇ-క్రాప్ ద్వారా ప్రతీ ఎకరాకు బీమా లభిస్తుందని తలిపారు. ఇప్పటికే వ్యవసాయాధికారులు పంటనష్టం అంచనావేసి తహశీల్దార్ అందించారని, ఖచ్చితంగా నష్టపోయిన రైతులకు పరిహారం అందుతుందని తెలిపారు. ఇరిగేషన్ కాలువలు 30 ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోవడం లేదని, ఆంధ్రాకాలువను మొదటి ప్రాధాన్యతగా తీసుకుని అభివృద్ధి చేస్తామన్నారు. అదేవిధంగా చెరువుల ఆక్రమణలు తొలగించి, పూడికలు తీయిస్తామని తెలిపారు. తక్షణం ఇరిగేషన్ ఎస్ఇ, డిఇ, ఎఇలతో సమావేశం ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రాంబాబు, జెడ్‌పిటిసి సభ్యులు మోలుగుమాటి నీరజాసుధాకర్, ఎఎంసి ఛైర్మన్ జగ్గవరపు జానకీరెడ్డి, వైసిపి నాయకులు గిరిభోగారావు, రాంబాబు, యండపల్లి రాజు, ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.


జీలుగుమిల్లిలో మాట్లాడుతున్న కె.విజయలక్ష్మి

బిజెపిని గద్దె దించితేనా దేశాభివృద్ధి : సిపిఎం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

దేశం అభివృద్ధి చెందాలంటే బిజెపిని గద్దెదించాలని సిపిఎం జిల్లా నాయకురాలు కొర్రి విజయలక్ష్మి అన్నారు. సిపిఎం రాష్ట్ర కమిటీ చేపట్టిన ప్రజారక్షణభేరి విజయవంతం చేయాలని కోరుతూ ఆదివారం ఆమె స్థానిక భగత్ సింగ్ కాలనీలో మహిళలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా రాష్ట్రంలో సిపిఎం నాలుగు బస్సుయాత్రలను చేపట్టిందన్నారు. కేంద్రంలో మోడీ విధానాలను అమలు చేస్తూ రాష్ట్రంలో జగన్ ప్రజలపై పెనుభారాలను మోపుతున్నారని విమర్శించారు. రక్షణ భేరి బస్సు యాత్ర ఈనెల ఆరో తేదీన జీలుగుమిల్లికి చేరుకుంటుందన్నారు. జీలుగుమిల్లి రైస్ మిల్ గ్రౌండ్‌లో జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అదే విధంగా బస్సుయాత్ర ముగింపు సందర్భంగా ఈ నెల 15న విజయవాడలో జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు నేలటూరి నిర్మల, వెంకటలక్ష్మి, బీర మణి, సూర్యకుమారి, నగీన సీత, షర్మిల, శిరీష పాల్గొన్నారు.

చాట్రాయి: ఈనెల 15వ తేదీన విజయవాడలో జరిగే ప్రజారక్షణ భేరి సభను విజయవంతం చేయాలని కోరుతూ మండలంలోని చిన్నంపేటలో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కొమ్ము ఆనందం మాట్లాడుతూ కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న బిజెపికి చరమగీతం పాడాలన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంచారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు

ఓటరు నమోదుకు ప్రత్యేక శిబిరాలు

ప్రజాశక్తి - ఉంగుటూరు

మండలంలో చేబ్రోలు, కైకరంలో పలు పోలింగు కేంద్రాలను నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి, ఏలూరు ఆర్‌డిఒ ఎస్‌కెఎస్.ఖాజావలి ఆదివారం తనిఖీ చేశారు. 49, 51, 52, 54, 61, 62, 64, 65, 66 పోలింగు కేంద్రాల్లో ఓటర్ల జాబితాను పరిశీలించారు. బిఎల్‌ఒలకు తగు సూచనలిచ్చారు. ఆయన వెంట ఉంగుటూరు తహశీల్దారు రమణరావు, ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ సాయి రమేష్ ఉన్నారు. ఓటర్ల ముసాయిదా జాబితాలో క్లయిమ్స్, అభ్యంతరాలు, కొత్త ఓటర్ల నమోదుకు ఉంగుటూరు నియోజకవర్గంలో శని, ఆదివారాల్లో నిర్వహించిన ప్రత్యేక క్యాంపులో 2393 దరఖాస్తులు వచ్చాయని ఖాజావలి తెలిపారు. కొత్త ఓట్లు కోసం ఉంగుటూరు మండలంలో 833, భీమడోలు - 645, నిడమర్రు-479, గణపవరం - 436 మొత్తం 2393 దరఖాస్తులను బిఎల్‌ఒలు తీసుకున్నారు.

పోలవరం : మండలంలోని కోండ్రుకోట గ్రామంలోని 256 పోలింగ్ బూత్‌ను ఐటిడిఎ పిఒ సూర్యతేజ ఆదివారం పరిశీలించారు. మండలంలోని వివిధ గ్రామాల పోలింగ్ స్టేషన్లలో ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమం చేపట్టారు. ఓటరు జాబితాలో చేర్పులు, మార్పులు, ఇతర సమస్యలపై అధికారులకు ఫిర్యాదు చేయొచ్చని పిఒ సూచించారు. తప్పుల్లేని ఓటరు జాబితా రూపొందించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ బి.సుమతి, విఆర్‌ఒలు, బిఎల్‌ఒలు, స్థానికులు పాల్గొన్నారు.

గోకుల పారిజాత గిరిలో టిక్ టాక్ దుర్గారావు సందడి

జంగారెడ్డిగూడెం: స్థానిక గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలో టిక్‌టాక్ దుర్గారావు దంపతులు సందడి చేశారు. ఆదివారం ఆలయాన్ని దుర్గారావు కుటుంబ సభ్యులతో సందర్శించారు. ఆలయానికి వచ్చిన పలువురు యాత్రికులు దుర్గారావు దంపతులతో సెల్ఫీలు దిగడానికి ఆసక్తి చూపారు. అనంతరం ఆలయంలో దంపతులు ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ప్రసాదం అందించారు.

పాత్రికేయులను ప్రభుత్వం గుర్తించాలి

ఎపిడబ్ల్యూజెఎఫ్ 16వ వార్షికోత్సవంలో వక్తలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

సమాజంలో కీలకపాత్ర పోషిస్తున్న పాత్రికేయులు శ్రమకు తగిన గుర్తింపు, ఆదాయం పొందలేకపోతున్నారని ప్రముఖ విద్యావేత్తఅలుగు ఆనంద శేఖర్ అన్నారు. ఆదివారం ఎపి వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ 16వ వార్షికోత్సవం స్థానిక ప్రియదర్శిని కళాశాలలో గొల్లమందల శ్రీనివాసరావు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా పాల్గొన్న ప్రియదర్శిని కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ అలుగు ఆనంద శేఖర్, సీనియర్ జర్నలిస్ట్ కెఎస్.శంకర్‌రావు కేకు కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆనంద్‌శేఖర్ మాట్లాడుతూ ఎపిడబ్ల్యూజెఎఫ్ ప్రభుత్వ గుర్తింపు పొందిన సంఘమన్నారు. ఈ సంఘం ఆధ్వర్యంలో పాత్రికేయుల సమస్యల పరిష్కారం కోసం జరుగుతున్న కృషి అభినందనీయమన్నారు. ఇతర వృత్తులతో పోలిస్తే జర్నలిజం పవిత్రమైనదని, ప్రభుత్వం ఐదేళ్ల అనుభవంతో అక్రిటిడేషన్ ఉన్న వారికి ఇంటి స్థలం ఇవ్వాలని నిర్ణయించడం సంతోషదాయకమన్నారు. పాత్రికేయుల సంఖ్య పెరిగిందని పని చేసే వారిని గుర్తించి ఇళ్ల స్థలాలివ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే పాత్రికేయులు నిబద్ధతతో, సంఘ నిబంధనలు పాటిస్తూ సమిష్టిగా ఉండాలని సూచించారు. సీనియర్ జర్నలిస్ట్ శంకర్‌రావు మాట్లాడుతూ వర్కింగ్ జర్నలిస్టులందరికీ ఇంటి స్థలంతో పాటు తెలంగాణా మాదిరిగా డబుల్ బెడ్ రూమ్ ఇళ్లుప్రభుత్వమే నిర్మించి ఇవ్వాలని కోరారు. 50 ఏళ్లు నిండిన, 20 ఏళ్లు సర్వీసు పూర్తి చేసిన జర్నలిస్టులకు రూ.ఐదు వేలు పెన్షన్ మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే వచ్చేనెల మూడో తేదీన జిల్లాకేంద్రం ఏలూరులో జరిగే జిల్లా మహాసభను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మీడియా హౌస్ కార్యదర్శి పిఎన్‌వి.రామారావు, సహాయ కార్యదర్శి నాని, కలపాల శ్రీనివాస్, కె.రవికిరణ్, బాసంశెట్టి నాగరాజు, కడిమి రాజేష్, కలపాల చందు, కిషోర్, బండి ప్రసాద్, కడలి గాంధీ, అచ్యుత సూర్య పాల్గొన్నారు.


కేక్ కట్ చేస్తున్న పాత్రికేయులు


పోలీసులు స్వాధీనం చేస్తున్న సర్టిఫికెట్ల తయారీ సామగ్రి

నకిలీ సర్టిఫికెట్ల గుట్టు రట్టు

ఇద్దరు అరెస్టు - ప్రింటర్, ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్, పలు నకిలీ సర్టిఫికెట్లు స్వాధీనం

ప్రజాశక్తి - చింతలపూడి

మీరు రోజూ కళాశాలకు వెళ్లనవసరం లేదు.. కష్టపడి చదవాల్సిన పనే లేదు.. పరీక్షలు రాయాల్సిన అవసరమే లేదు.. కానీ మీకు కావాల్సిన సర్టిఫికెట్ మీ దగ్గరకు వచ్చేస్తుంది. కానీ మీరు చేయాల్సిందల్లా ఒక్కటే డబ్బు చూసుకుంటే చాలు.. అవసరమైన సర్టిఫికెట్ మీ చేతికి వస్తుంది. రూ.30 ఉంటే చాలు పదో తరగతి, రూ.40వేలు ఉంటే ఇంటర్ సర్టిఫికెట్లు మీ ఇంటికి వచ్చేస్తాయి. అలాగే రూ.80 వేలకు డిగ్రీ, రూ.లక్ష నుంచి రూ.రెండు లక్షలు చూసుకుంటే బిటెక్, ఎంటెక్ వంటి విలువైన సర్టిఫికెట్లు ఇట్టే వచ్చేస్తాయి.. కానీ అవన్నీ ఒరిజినల్ సర్టిఫికెట్లు కాదండోయ్ నకిలీవి.. ఇది చింతలపూడి, ఏలూరుకు చెందిన ఇద్దరు వ్యక్తుల 'నకిలీ'మాయాజాలం.. వీరి గుట్టును ఎట్టకేలకు పోలీసులు రట్టు చేశారు.

నకిలీ సర్టిఫికెట్లు తయారు చేస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు చింతలపూడి సిఐ మల్లేశ్వరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం సాయంత్రం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. చింతలపూడికి చెందిన సోంబాబు, ఏలూరుకు చెందిన దినేష్ వీరిద్దరూ కలిసి నకిలీ సర్టిఫికెట్లు రూపొందించి విద్యార్థుల నుంచి డబ్బు వసూలుకు పథకం రచించారు. ఈ క్రమంలో జిల్లాకేంద్రం ఏలూరులో ఓ కార్యాలయాన్ని ప్రారంభించారు. వీరిలో సోంబాబు సర్టిఫికెట్లు అవసరమైన విద్యార్థులను గుర్తించి వారివద్దకు వెళ్లి సర్టిఫికెట్లు ఇప్పిస్తామని నమ్మబలికి డబ్బు వసూలు చేసేవాడు. అభ్యర్థుల ఆధార్, ఇతర వివరాలను సేకరించి దినేష్‌కు వాట్సప్ ద్వారా పంపేవాడు. దీంతో అతను నకిలీ సర్టిఫికెట్లను విద్యార్థులకు అందించేవారు. అయితే ఒరిజినల్ సర్టిఫికెట్లకు తీసిపోని విధంగా వాటిని తయారు చేయడంలో దినేష దిట్ట. సర్టిఫికెట్‌కు అవసరమైన స్టాంపులు, హోలో గ్రామ్ స్టిక్కర్లు, ప్రింటర్, యూనివర్సిటీ హెడ్స్ సంతకాలు, క్వాలిటీ పేపర్ వినియోగించి వీటిని తయారు చేసేవారు. దీంతో అభ్యర్థులు సులువుగా వారివలలో పడ్డారు. ఎక్కువగా పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, బిటెక్, ఎంటెక్ తదితర యూనివర్శిటీల సర్టిఫికెట్లను తయారు చేసి విద్యార్థులకు ఇచ్చేవారు. ఈ సర్టిఫికెట్లు మొత్తం ఏలూరులోని ఓ డిస్టెన్స్ కళాశాల పేరున తయారు చేసి ఇవ్వడంతో విషయం వెలుగులోకి వచ్చింది. ఇది గుర్తించి ఆ కళాశాల యాజమాన్యం చింతలపూడి పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు చాకచక్యంగా వారిద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. తమదైన శైలిలో విచారించడంతో నిందితులు అసలు విషయాన్ని వివరించారు. వారి వద్ద నుంచి పలు సర్టిఫికెట్లు, ప్రింటర్, స్టాంపులు, హోలోగ్రామ్స్, ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్, సర్టిఫికెట్ మీటరు, తదితర సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఈ సర్టిఫికెట్లను సుమారు 50 మందికి ఇచ్చినట్లు నిందితులు తెలిపారు. పదో తరగతి, ఇంటర్ సర్టిఫికెట్లకు రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకూ, డిగ్రీ అయితే రూ.80 వేల నుంచి రూ.లక్ష వరకూ, బిటెక్, ఎంటెక్ సర్టిఫికెట్లకు రూ.లక్ష నుంచి రూ.రెండు లక్షల వరకూ వసూలు చేసేవారమని నిందితులు ఒప్పుకున్నారు. వీరిని కోర్టులో హాజరుపరుస్తామని సిఐ తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో ఎస్ఐ ప్రసాద్ పాల్గొన్నారు.

పశ్చిమలో అభివృద్ధి కనుమరుగు

- దృష్టి సారించని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు
- సమస్యలతో జిల్లా వాసులు సతమతం
- ప్రజా రక్షణ భేరి ముందు జిల్లా సమస్యలు
- ఈనెల 8న జిల్లాలో పర్యటించనున్న సిపిఎం ప్రజా రక్షణ భేరి యాత్ర

ప్రజాశక్తి - భీమవరం (పశ్చిమగోదావరి)

జిల్లాలో అభివృద్ధి కనుమరుగవుతోంది. ప్రభుత్వాలు పాలకులు జిల్లాపై చూపిస్తున్న కపట ప్రేమతో రాను రాను అభివృద్ధి కుంటుపడుతోంది. అపారమైన వనరులు అందుబాటులో ఉన్నా అభివృద్ధి మాత్రం శూన్యం. ఒకపక్క సారవంతమైన నేలలు, గోదావరి జలాలు, సముద్రతీరం తదితర వనరులున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అభివృద్ధిపై దృష్టి సారించడం లేదు. ఈ నేపథ్యంలో జిల్లా వాసులు సమస్యలతో సతమతమవుతున్నారు. ప్రజా సమస్యలే ఎజెండాగా నిరంతరం సమస్యలపై పోరాడుతున్న సిపిఎం ప్రజా రక్షణ భేరి చేపట్టింది. ఈనెల 8వ తేదీన చించినాడ వద్ద జిల్లాలోకి ప్రవేశించనుంది. జిల్లా సమస్యలపై ప్రజా రక్షణ భేరీలో గలం విప్పనున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చి సమస్యలు పరిష్కరించేందుకు సిపిఎం ప్రణాళిక రూపొందించి ముందుకు సాగుతోంది.

జిల్లాలో అపారమైన వనరులు ఉన్నాయి. సారవంతమైన నేలలు, వివిధ రకాల పంటలు, గోదావరి జలాలు, మానవ వనరులు అందుబాటులో ఉన్నాయి. వీటితోపాటు గ్యాస్, సహజవాయువు వంటి నిక్షేపాలు సమృద్ధిగా ఉన్నాయి. ఆహ్లాదకరంగా సముద్ర, గోదావరి తీర ప్రాంతాలు ఉన్నాయి. అయితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జిల్లా అభివృద్ధికి అన్ని అవకాశాలున్నప్పటికీ నామమాత్రపు చర్యలు తీసుకోవడం తప్ప పూర్తిస్థాయిలో పట్టించుకున్న దాఖలాలు లేవు. జిల్లాలో ప్రధానంగా వ్యవసాయం, ఆక్వారంగాలతో పాటు అనుబంధ రంగాలు, వివిధ రకాల పంటలపై ఆధారపడి ఎంతో మంది జీవనం సాగిస్తున్నారు. అయితే నేడు అన్ని రకాల పంటలు సంక్షోభంలో కూరుకుపోయాయి. జిల్లాలో 60 నుంచి 70 శాతం మంది కౌలు రైతులే ఉన్నారు. వీరందరికీ పూర్తిస్థాయిలో గుర్తింపు కార్డుల్లేవు. సకాలంలో రుణాలు అందడం లేదు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించిన సమయంలో పంటల నష్ట పరిహారం కూడా అందడం లేదు. పంటలకు కనీస గిట్టుబాటు ధర లేక వ్యవసాయం, ఆక్వా, కొబ్బరి, ఉద్యాన పంటల రైతులు రూ.వందల కోట్లు నష్టపోతున్నా పరిస్థితి నెలకొంది. దీనికితోడు ఆధునికీకరణ పనులు పూర్తి కాకపోవడం జిల్లాకు ఒక శాపంగా ఉంది. నక్కల డ్రెయిన్, గొంతేరు, యనమదుర్రు, బొండాడ, ఉప్పుటేరు. గోస్తనీ డ్రెయిన్లను ఆధునికీకరించకపోవడంతో వర్షం వస్తే ఈ డ్రెయిన్లన్నీ పొంగిపొర్లి వేలాది ఎకరాల పంట నీట మునిగి పోతున్న పరిస్థితి ఉంది. దీంతో రైతులు నష్టాల ఊబిలో కూరుకుతున్నారు.

తగ్గిపోతున్న సాగు విస్తరణ

గతంతో పోలిస్తే వ్యవసాయం, ఆక్వాసాగు విస్తీర్ణం రాను రాను తగ్గిపోతోంది. గతంలో రెండు లక్షల నలభై వేల ఎకరాల్లో వరి సాగు జరగ్గా ప్రస్తుతం 10 శాతం తగ్గిపోయింది. అలాగే లక్షా 80 వేల ఎకరాల్లో ఆక్వాసాగు జరగ్గా సగానికిపైగా సాగు విస్తరణ తగ్గింది. దీంతో ఉపాధిపై తీవ్ర ప్రభావం పడింది. పని దినాలు క్రమంగా తగ్గుతున్నాయి. ఇతర రాష్ట్రాల నుంచి వలస కార్మికులు ఇక్కడకు వస్తున్న పరిస్థితి ఉంది. దీంతో కారుచౌకగా వలస కార్మికులు దొరకడంతో వారు దోపిడీకి గురవుతున్నారు. ఈ నేపథ్యంలో వ్యవసాయ పనులేక్క ఉపాధి దెబ్బతింటున్నా పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా వృత్తి దారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కల్లుగీత వృత్తి క్రమేపీ తగ్గుతూ దెబ్బతింటోంది. మత్స్య కార్మికులకు ప్రోత్సాహకం, రక్షణ లేదు.

పడకేసిన పరిశ్రమలు

తణుకు షుగర్ ఫ్యాక్టరీ, డెల్టా పేపర్ మిల్లు, ఉమ్మడి జిల్లాలో జ్యూట్ మిల్లులు, అనేక చిన్న పరిశ్రమలు, రైస్ మిల్లులు మూతపడ్డాయి. దీంతో యువతకు ఉపాధి అవకాశాలు బాగా తగ్గాయి. ప్రధానంగా వందలాది రైస్ మిల్లులు మూతపడడంతో లక్షల మంది కార్మికుల ఉపాధి పూర్తిగా దెబ్బతింది. దీంతో అనేకమంది కార్మికులు ఇతర ప్రాంతాలకు వలసలు పోతున్నారు. మరి కొంతమంది స్థానికంగా అపార్టుమెంట్లలో వాచ్‌మెన్లుగా, హోటల్లో పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వైసిపి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాలుగున్నరేళ్లలో సన్న, చిన్నకారు పరిశ్రమలు తప్ప భారీ పరిశ్రమలు ఏ ఒక్కటీ ఏర్పాటు కాలేదు.

రెడ్ జోన్‌లోకి జిల్లా..

జిల్లాలో కాలుష్యం విపరీతంగా పెరిగిపోవడంతో అనారోగ్యాలు పెరిగిపోయి రెడ్ జోన్‌లోకి వెళ్లింది. జిల్లాలో రకరకాల వ్యాధులు విజృంభిస్తున్నాయి. సురక్షిత తాగునీరు లేక కొనుగోలు చేసుకోవాల్సిన పరిస్థితి. కేన్సర్, గుండె, లివర్, కిడ్నీ, చర్మ వ్యాధులు ఎక్కువగా జిల్లాలోనే ఉన్నాయి. జిల్లాకు చెందిన వారు హైదరాబాద్, విజయవాడ, బెంగళూరు, చెన్నయ్ వంటి మహానగరాల్లో కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స పరిస్థితి నెలకొంది.


వేలాది ఎకరాల్లో ప్రభుత్వ భూములు

జిల్లాలో వేల ఎకరాల్లో వివిధ రకాల ప్రభుత్వ భూములు ఉన్నాయి. అయితే ఇవన్నీ పెత్తందారుల చేతిలో ఉన్నాయి. అయితే జిల్లాలో వ్యవసాయ ఆధారిత రంగాలపై ఆధారపడి లక్షల మంది జీవన సాగిస్తున్నారు. కాళ్ల, భీమవరం, నరసాపురం, యలమంచిలి, ఆచంట, పెనుగొండ మొగల్తూరు మండలాల్లో సిఎడి, కాళీపట్నం, అసైన్డ్ భూములు వేలాది ఎకరాలు ఉన్నాయి. ఈ భూములను పేదలకు పంచితే పేదలు, రైతులు అభివృద్ధి చెందుతారు. ప్రభుత్వాలు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం పట్ల ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పర్యాటక రంగానికి అణువుగా 15 ప్రాంతాలు

జిల్లాలో పర్యాటకరంగ అభివృద్ధికి అనేక ప్రాంతాలు అణువుగా ఉన్నాయి. కొల్లేరు పరివాహక ప్రాంతాలు, ఉప్పుటేరు, గొంతేరు, గోదావరి, సముద్రతీరం వంటివి 15 ప్రాంతాలు ఉన్నాయి. వీటిని అభివృద్ధి చేస్తే పర్యాటక రంగం అభివృద్ధి చెందుతుంది. అయితే ప్రభుత్వం పర్యాటక రంగ అభివృద్ధికి నామమాత్రపు చర్యలు తీసుకుని చేతులు దులుపుకుంటోంది.

ఆచంట, యలమంచిలి, నరసాపురం మండలాల్లోని గోదావరి తీర ప్రాంతంలో అనేక లంక గ్రామాలు ఉన్నాయి. ఏటా వరదల తాకిడికి సుమారు 30. గ్రామాల వరకూ ముంపు బారిన పడుతున్నాయి. బాహ్య ప్రపంచంతో సంబంధం లేకుండా బిక్కు బిక్కు మంటూ జీవన సాగిస్తున్నారు. లంక గ్రామాల ప్రజలకు రవాణా సౌకర్యం కల్పిస్తామని పాలకులు హామీ ఇచ్చినా అమలుకు నోచుకోలేదు. నరసాపురం-కోటిపల్లి రైల్వేలైన్లో పనులు మందకోడిగా సాగుతున్నాయి. ఉండి, శృంగవృక్షం, పాలకొల్లు రైల్వే క్రాసింగులు ఉన్న చోట్ల రైల్వే ఓవర్ బ్రిడ్జిలు, అండరాసుల నిర్మాణం చేపట్టాల్సి ఉన్నప్పటికీ వాటిపై దృష్టి సారిస్తున్న పరిస్థితి లేదు. జిల్లా అభివృద్ధికి అనేక అవకాశాలు ఉన్నప్పటికీ పాలకులు చర్యలు తీసుకోని పరిస్థితి నెలకొంది.


చెక్కపల్లిలో మద్దతుదారులతో రామకోటయ్య

'నూజివీడు అభివృద్ధి తమకే సాధ్యం'

ముసునూరు : నూజివీడు నియోజకవర్గంలో అభివృద్ధి సాధించడం తమకే సాధ్యమని, ఎంతమంది ఎంఎల్ఎలు వచ్చినప్పటికీ నూజివీడు అభివృద్ధిలో శూన్యమని మాజీ ఎంఎల్ఎ చిన్నం రామకోటయ్య అన్నారు. ఆదివారం మండలంలోని చెక్కపల్లి గ్రామంలో మండలంలోని 16 గ్రామాల నాయకులతో కలిసి ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వతంత్య్రం వచ్చి 75 సంవత్సరాలు పూర్తైనప్పటికీ, నూజివీడు వెళ్లాలన్నా, మండల కేంద్రమైన ముసునూరు వెళ్లాలన్నా, వర్షం వస్తే వాగులు, వంకలు దాటాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. నూజివీడు పట్టణం గత 50 సంవత్సరాల క్రితం ఎలా వుందో, ఇప్పటికీ అలాగే ఉందన్నారు. రోడ్ల దుస్థితి బాలేదని, నిరుద్యోగ యువతకి ఉపాధి లేదని విమర్శించారు. అనంతరం చాట్రాయి మండలం చిన్నంపేట వార్డు సభ్యులు సుమారుగా తమ అనుచరులతో కలిసి మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముసునూరు, చెక్కపల్లి, పాల్గొన్నారు.

వికలాంగులకు కృత్రిమ అవయవాల పంపిణీ

ఏలూరు టౌన్ : దొండపాడులోని ఉమా ఎడ్యుకేషనల్, టెక్నికల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న జిల్లా వికలాంగుల పునరావాస కేంద్రంలో అంతర్జాతీయ ప్రొస్టెటిక్స్, ఆర్థోటిక్స్ దినోత్సవం సందర్భంగా అవసరమైన వారికి సంస్థ కో ఆర్డినేటర్ డి.శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా కృత్రిమ అవయవాలు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ మా సంస్థ ద్వారా 35 సంవత్సరాలుగా ఎంతో మంది వికలాంగులకు పునరావాసం కల్పించి సేవలు అందిస్తున్నామన్నారు. జిల్లా వికలాంగుల పునరావాస కేంద్రం ద్వారా వికలాంగులకు అవసరమైన సేవలు అందించడం జరుగుతుందన్నారు. వాటిలో కృత్రిమ అవయవాలు, ఫిజియో థెరఫీ, ఆడియోలజి, స్పీచ్ థెరఫీ మొదలగు సేవలను ఉపయోగించుకోవాలని సూచించారు. ఇతర వివరాల కోసం 08812-249297, 7386565469 సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వికలాంగుల పునరావాస కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.


వికలాంగులకు అందజేసిన కృత్రిమ అవయవాలు


వర్షానికి నీట మునిగిన జగనన్న కాలనీ


అస్తవ్యస్తంగా కాలనీ రహదారి

ముంపులో స్థలాలు.. నిలిచిన ఇళ్ల నిర్మాణాలు..!

ప్రజాశక్తి - కలిదిండి

మండలంలో జగనన్న ఇళ్ల నిర్మాణాలు మందకొడిగా సాగుతున్నాయి. కాలనీల్లో మౌలిక సదుపాయల కల్పనలో తీవ్రజాప్యం కావడం, నిర్మాణ సామగ్రి ధరలు పెరిగిపోవడంతో, ప్రభుత్వం ఇచ్చే సాయంతో ఇళ్లు సగం కూడా పూర్తవ్వట్లేదు. బిల్లులు సకాలంలో మంజూరు కాకపోవడం, గ్రామానికి చాలా దూరంలో నివాస యోగ్యానికి అనువుగా లేని ప్రదేశాల్లో లేఅవుట్‌లు వేయడం వంటి కారణాలతో చాలా మంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను మధ్యలోనే ఆపేశారు. ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయకపోతే పట్టాలు రద్దవుతాయని అధికారులు హెచ్చరించడంతో పునాదులు మాత్రమే వేసి సరిపెట్టారు. వర్షం వస్తే చాలు కాలనీ రోడ్లన్నీ బురదమయం అవుతున్నాయి. ప్రభుత్వం స్పందించి కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించి, ఇళ్ల నిర్మాణాలకు చొరవ చూపాలని ప్రజలు కోరుకుంటున్నారు.

కలిదిండిలోని జగనన్న ఇళ్ల కాలనీకి అతీగతీ లేకుండా పోయింది. సుమారు 20 ఎకరాల 24 సెంట్ల భూమిని జగనన్న ఇళ్ల కాలనీకి ప్రభుత్వం కొనుగోలు చేసింది. ఎకరం భూమి ఖరీదు సుమారు రూ.30 లక్షల పై మాటే. సుమారు 770 ఫ్లాట్స్‌లకు రెవెన్యూ యంత్రాంగం సరిహద్దు రాళ్లు ఏర్పాటు చేశారు. భారీ స్థాయిలో కాలనీ నిర్మాణం ఏర్పడుతుందని లబ్ధిదారులు ఆశతో ఎగబడ్డారు. లబ్ధిదారులకు ఫ్లాట్స్ కేటాయించారు. సిబి కెనాల్‌కి దిగువన పేట కలిదిండి తుమ్మల కోడు కాలువ నుంచి కోట కలిదిండి మిలటరీ కాలువకు మధ్యన ఈ కాలనీకి భూ సేకరణ జరిగింది. కలిదిండి పంచాయతీ పరిధిలోని వారికే కాక సమీప గ్రామాలలోని లబ్ధిదారులకు ఈ కాలనీలో చోటు కల్పించారు. లోతట్టు ప్రాంతం కావడంతో మొదటి విడత పూడిక చాలదని రెండో విడత కూడా పూడిక చేశారు. అయినా అది పల్లపు ప్రాంతం కావడంతో ఇళ్లు కట్టుకోవాలంటే చుక్కలు కనిపిస్తున్నాయని లబ్ధిదారులు వాపోతున్నారు. ప్రస్తుత నేల నుంచి భూమిలోకి సుమారు పది అడుగులు అలాగే పైకి ఐదు అడుగుల ఎత్తులో పిల్లర్ల నిర్మాణం చేయాలి. పై ఐదు అడుగుల ఎత్తు బేస్మెంట్ వరకు మట్టితో పూడ్చాలి. బేస్మెంట్ వరకే ఖర్చు రూ.80 వేల నుంచి లక్ష వరకు అవుతోందని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చేది రూ.లక్షా యనభై వేలే. మిగిలిన రూ.లక్ష ఇంటి నిర్మాణం ఎలా పూర్తి చేయగలమని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు.

సుమారు 770 ప్లాటులకు గాను తొమ్మిది మంది లబ్ధిదారులు మాత్రమే ఇంటి నిర్మాణానికి సిద్ధమయ్యారంటే పరిస్థితి తీవ్రత అర్థం చేసుకోవచ్చు. తొమ్మిది మందిలో ఏడుగురు బేస్మెంట్ వరకు మరో ఇద్దరు బేస్మెంట్‌ను దాటారు. ఇదిలా వుంటే ప్లాటులకు రోడ్ల విస్తీర్ణం నిర్ణయించారు. కానీ రోడ్లు వేయలేదు. అసలు ఈ కాలనీ వద్దకు గ్రామం నుంచి వెళ్లే ప్రధాన రహదాకి చిన్న చినుకు పడితే చాలు బురదమయంగా మారుతుంది. వాహనాలు వెళ్లలేని దుస్థితి. సుమారు రూ.7.20 కోట్లతో భూమి కొనుగోలు చేసిన ప్రభుత్వం లబ్ధిదారులకు మౌలిక వసతుల కల్పనలో వెనుక బడిందనే చెప్పాలి. కొనుగోలు చేసిన భూమిలో 2 ఎకరాల 24 సెంట్లలో ప్లాటులు వేయడానికి కూడా నోచుకోలేదంటే పరిస్థితి తీవ్రత అర్థం చేసుకోవచ్చు. జగనన్న ఇళ్ల కాలనీ ఆశయం పెద్దదే. అమలు కానీ ఆశయాలతో ప్రజాధనం దుర్వినియోగం చేయడమేననే వాదన వినిపిస్తోంది. ఎలాగైనా ఇళ్ల నిర్మాణం చేపట్టాలనే సంకల్పంతో ఇటీవల ఓ ఒప్పందానికి వచ్చారు. ప్రభుత్వం ఇచ్చే రూ.1.80 లక్షలకు తోడు లబ్ధిదారుడు మరో రూ.2.50 లక్షలు ఇస్తే కాంట్రాక్టు పద్ధతిలో పూర్తి చేయాలని నిర్ణయించుకున్నారు. ఏం జరిగిందో తెలియదు కానీ సుమారు 200 ఇళ్ల నిర్మాణానికి సుమారు ఎనిమిది అడుగుల లోతుకు పైగా బోర్లు వేశారు. వదిలేశారు. గోతులు మాత్రం దర్శనమిస్తున్నాయి. అటుగా వెళ్లే వారికి సరిహద్దు రాళ్లు అలంకార ప్రాయంగా దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా కలిదిండిలోని జగనన్న ఇళ్ల కాలనీకి మరో విడత పూడిక చేసి, మౌలిక వసతులు కల్పిస్తే లబ్ధిదారులు ముందుకు వస్తారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పేదల జగనన్న ఇళ్ల కాలనీ పూర్తి చేసేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

బహిరంగ సభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

ఈనెల 15వ తేదీన విజయవాడ మాకినేని బసవ పున్నయ్య స్టేడియంలో సిపిఎం బహిరంగ సభ నిర్వహించనున్నట్లు సిపిఎం మండల కార్యదర్శి నిమ్మగడ్డ నరసింహ తెలిపారు. మండలంలోని పల్లెర్లమూడి గ్రామములో సిపిఎం బహిరంగ సభకు సంబంధించి డోర్ స్టిక్కర్లను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సభలో రాజకీయ దిశ నిర్దేశం జరుగుతుందన్నారు. ఈ సభకు అన్ని వర్గాల ప్రజలు హాజరు కావాలని కోరారు.

చిన్న నాటి నుంచి సంగీతం నేర్చుకోవాలి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

చిన్న వయసులో నేర్చుకున్న సంగీతం వారి జీవితాలలో చాలా ప్రభావం చూపుతోందని, సంగీతం నేర్చుకోవాలని ప్రభుత్వ సంగీత ఉపాధ్యాయులు జువ్వల రాజ్ కుమార్ తెలిపారు. ఆదివారం స్థానిక త్రివేణి ప్రసాద్ కళాశాల ప్రాంగణంలో పూర్విక సంగీత సాగరం సంగీత పాఠశాల ప్రథమ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్ కుమార్ మాట్లాడుతూ సంగీతం నేర్చుకొనే వారికి తెలియకుండానే క్రమశిక్షణ అలవడుతుందని తెలిపారు. రాబోయే కాలంలో సంగీతం అభ్యసిస్తున్న చిన్నారులు ఎన్నో విజయాలు సాధిస్తారన్నారు. పూర్విక సంగీత సాగరం సంగీత పాఠశాల నిర్వాహకులు సోడెం విజయ రాజ్ కుమార్ మాట్లాడుతూ పట్టణంలోని హర్షవర్ధన్ హాస్పిటల్ పక్కన మొట్టమొదటి సారిగా ప్రారంభించిన పూర్విక సంగీత సాగరం సంగీత పాఠశాల గత సంవత్సరం విద్యార్థులకు గాత్ర సంగీతం, కీబోర్డ్, గిటార్, ఫ్లూట్‌లలో శిక్షణ పొందుతున్నారని తెలిపారు. పిల్లలు కచేరి చేసే స్థాయికి రావటం చాలా గర్వంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జానపద కళారత్న అవార్డు గ్రహీత కృష్ణబాబు, నాట్య మయూరి శ్రీరూపదేవి, ట్రంపేట్ విద్వాన్ షేక్ లాల్ సాహెబ్, విద్యార్థుల తల్లిదండ్రులు, కళాకారులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ దుర్మార్గం

8న విద్యాసంస్థల బంద్

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రయివేటీకరణ చేయాలని, రూ.లక్షల కోట్ల ఆస్తులను కారు చౌకగా ప్రయివేటు వ్యక్తులకు అప్పజెప్పాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించుకోవడం దుర్మార్గపు చర్య అని పిడిఎస్‌యు జిల్లా ఉపాధ్యక్షులు బి.వినోద్ తెలిపారు. ఆదివారం బుట్టాయగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో పిడిఎస్‌యు ఆధ్వర్యంలో బంద్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వినోద్ మాట్లాడుతూ విభజన హామీలలో భాగంగా కడప ఉక్కు కర్మాగారాన్ని ఏర్పాటు చేస్తామని నాటి కాంగ్రెస్, కేంద్ర ప్రభుత్వం మాట ఇచ్చిందన్నారు. 2014లో అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం నేటికీ కడపలో ఉక్కు కర్మాగారం నిర్మాణం చేపట్టడం లేదన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రయివేటీకరణను ఆపి ఆ పరిశ్రమ మీద ఆధారపడిన కార్మికుల, ఉద్యోగుల భవిష్యత్తును కాపాడాలని డిమాండ్ చేశారు. స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న వెయ్యి రోజుల నిరాహార దీక్షలకు, స్టీల్ ప్లాంట్ నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి మద్దతుగా నవంబర్ 8వ తేదీన రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్‌కు విద్యార్థి యువజన సంఘాలు పిలుపు ఇవ్వడం జరిగిందన్నారు. కావున విద్యా సంస్థల యాజమాన్యాలు, విద్యార్థులు బంద్‌ను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్‌యు నాయకులు జి.వినయ్, కె.రామ్ చరణ్, ఎం.శివతేజ, కె.అభినంద్, ఎన్.ఆకాష్ పాల్గొన్నారు.

ఓటరు లిస్ట్ పరిశీలన : టిడిపి

ప్రజాశక్తి - ముసునూరు

ఓటర్ లిస్టలను పరిశీలిస్తున్న టిడిపి శ్రేణులు. ఆదివారం మండలంలోని 16 గ్రామాల్లో బూతు లెవెల్ ఆఫీసర్లతో పాటు బూత్ ఇన్‌ఛార్జిలు, బిఎల్‌ఒలతో కలిసి టిడిపి శ్రేణులు ఆయా గ్రామాల్లోని నూతన ఓట్లను, చేర్పులు, మార్పులను పరిశీలించారు. ఓట్లు లేని వ్యక్తులకు నూతన ఓటు కల్పించే విధంగా చర్యలు చేపట్టడం జరుగుతుందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గద్దె రఘుబాబు, కొల్లి గంగారామ్, మందలపు ధర్మరాజు, భాను, కృష్ణయ్య, గిరి పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

రేషన్ అక్రమ రవాణా విక్రేతల అరెస్టు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్


వాహనాలను సీజ్ చేసిన అధికారులు

వాహనాల్లో రేషన్ బియ్యం నింపుతున్నారన్న సమాచారాన్ని అందుకున్న విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆ ప్రాంతంలో దాడి చేసి దాదాపు 60 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని, ఆరుగురిని అరెస్టు చేసినట్లు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిఐ విల్సన్ తెలిపారు. సిఐ తెలిపిన వివరాల ప్రకారం ఏలూరులోని దొండపాడు గ్రామ శివారులోని దత్తాశ్రమం వద్ద రెండు వాహనాలలో రేషన్ బియ్యాన్ని నింపుతున్నట్లు విజిలెన్స్ అధికారులు సమాచారం అందుకున్నారు. వెంటనే ఆ ప్రాంతానికి వెళ్లి దాడి చేయగా ఒక టాటా ఏస్ వాహనంలో 50 క్వింటాళ్ల రేషన్ బియ్యం మరొక టాటా ఏస్ వాహనంలో పది క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని వారు గుర్తించారు. వీటిని ఏలూరు నుంచి కాకినాడకు తరలిస్తున్నట్లు వారు గమనించారు. వెంటనే రెండు వాహనాలను సీజ్ చేశారు. రేషన్ బియ్యం, టాటా ఏస్ వాహనాలు మొత్తం వీటి విలువ రూ.16 లక్షల 40 వేలుగా ఆయన తెలియజేశారు. వాహనాలలో బియ్యం రవాణా చేస్తున్న కొనకళ్ళ సాయి మనోజ్, పావులూరి రామయ్య, రాయి విమలాదేవి, పితాని శ్యామ్, మణికంఠ, తల్లిబోయిన ఏడుకొండలు, దొంతిన సతీష్ అనే ఆరుగురు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. ఈ దాడిలో విల్సన్‌తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

తెలంగాణా మద్యం పట్టివేత

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

తెలంగాణా నుంచి అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వి.చంద్రశేఖర్ తెలిపారు. ఆదివారం జీలుగుమిల్లి జాతీయ రహదారిపై వాహనాల తనిఖీ చేస్తుండగా తెలంగాణ రాష్ట్రం నుంచి పల్లెల తులసీ రామ్ తన వద్ద ఉన్న సంచిలో 6 మద్యం బాటిళ్లతో గ్రామానికి వస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. మద్యాన్ని సీజ్ చేసి ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకొని, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

జీలుగుమిల్లి : పేకాట శిబిరంపై దాడులు చేసి ఐదుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ కె.నాగేశ్వరావు తెలిపారు. మండలంలోని పాకలగూడెం శివారులో ఆదివారం పేకాట ఆడుతున్నారని సమాచారం మేరకు దాడి చేయగా ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.3,940 నగదును, 52 పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నామన్నారు. వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఏలూరు స్పోర్ట్స్ : పేకాట శిబిరంపై దాడి చేసి ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేసిన ఘటన ఏలూరులోని శనివారపు పేట గ్రామంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. మూడో పట్టణ సిఐ శివాజీ తెలిపిన వివరాల ప్రకారం నగరంలోని మూడో పట్టణ పరిధిలో శనివారం పేట స్మశాన వాటికలో పేకాట ఆడుతున్నారన్న సమాచారాన్ని అందుకున్న సిఐ శివాజీ ఆయన సిబ్బందితో కలిసి ఆ ప్రాంతంలో దాడి చేశారు. అక్కడ పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.4,150 నగదు, మూడు సెల్ ఫోన్‌లు, ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారన్నారు. వెంటనే వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించారని తెలిపారు.

'పేదల సమస్యలపై నిరంతర పోరాటం'


సభలో మాట్లాడుతున్న బాబూరావు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

పేదలు, ఆదివాసీల సమస్యలపై న్యూ డెమోక్రసీ పార్టీ 1973 నుంచి పనిచేస్తుందని జిల్లా కమిటీ సభ్యులు కారం రాఘవ, డివిజన్ కమిటీ సభ్యులు తగరం బాబురావు తెలిపారు. సిపిఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ అమరవీరుల సభ దండిపూడి గ్రామంలో మామిడి మురళి అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సభకు ముందు అమరులైన అమరవీరులకు రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ పోరాటాలలో ప్రత్యక్షంగా గాని పరోక్షంగా గాని ఎంతోమంది ప్రాణాలు విడిచి అమరులయ్యారని తెలిపారు. ఏజెన్సీలో ఆదివాసీలకు భూమి కోసం భుక్తి కోసం పేద ప్రజల విముక్తి కోసం నాటి నుంచి నేటి వరకు ఉద్యమాలు చేస్తూనే ఉందన్నారు. అట్టి ఉద్యమాల్లో అమరులైన వారు కామ్రేడ్ ధర్మన్న, అర్జ నాగన్న, భీమన్న, రామారావు, రవన్న ఎంతోమంది ఉద్యమాల్లో అమరులయ్యారన్నారు అమరవీరుల ఆశయాలను ముందుకు తీసుకెళ్లడానికి నేటితరం కృషి చేయాలని తెలిపారు. ఏజెన్సీలో ఆదివాసి చట్టాలను పటిష్టంగా అమలు చేయాలన్నారు. పోలవరం నియోజకవర్గంలో రోడ్లు పూర్తిగా పాడైపోయి ప్రయాణాలకు ఇబ్బందికరంగా మారాయని, రోడ్లను తక్షణమే నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కలువు రామన్న, సరియం శర్మ, రాజు, కొక్కిరి వెంకటస్వామి, బుల్లబ్బాయి, పోచమ్మ, రామిరెడ్డి పాల్గొన్నారు.

కొల్లేరు ఆక్రమణలు తొలగించాలని ఆదేశం

రోనాల్డ్ రాజు ఫిర్యాదు మేరకు స్పందించిన ప్రభుత్వం

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

కొల్లేరులో అక్రమ తవ్వకాలపై క్రిమినల్ న్యాయవాది రోనాల్డ్ రాజు ఫిర్యాదు చేయగా దీనిపై స్పందించిన ప్రభుత్వం వెంటనే ఆక్రమణలను తొలగించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పశ్చిమగోదావరి జిల్లా, ఉమ్మడి కృష్ణాజిల్లా పరిధిలోని కొల్లేరు నిషేధిత ప్రాంతంలో అక్రమంగా చేపల చెరువులు తవ్వుతున్నారని, ఇది సుప్రీంకోర్టు ఆదేశాలకు, నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఉత్తర్వులకు విరుద్ధమని ఏలూరుకు చెందిన హైకోర్టు న్యాయవాది జి.రోనాల్డ్ రాజు రాష్ట్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీకి, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా, ఉమ్మడి కృష్ణాజిల్లా పరిధిలో గల ఏలూరు, ప.గో.జిల్లా, మచిలీపట్నం జిల్లాల కలెక్టర్లకు, పర్యావరణ, అటవీశాఖ, రెవెన్యూ శాఖ, మత్స్య శాఖల ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. కొల్లేరు ప్రాంతంలోని 9 మండలాల్లో 76,243 ఎకరాల భూములు ఉన్నాయని, వివిధ ప్రపంచ దేశాలకు చెందిన 189 రకాల పక్షులు కొల్లేరులో సంచరిస్తున్నాయని వివరించారు. ఈ కొల్లేరు భూముల్లో అక్రమంగా చేపల చెరువులు తవ్వుతున్నారని, వారిని ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, చట్టప్రకారం చర్యలు తీసుకోవడం లేదని న్యాయవాది తన ఫిర్యాదులో పేర్కొన్నారు. జీఓ నెంబర్ 120, పర్యావరణ, అటవీ శాఖ, సైన్స్ అండ్ టెక్నాలజీ డిపార్ట్‌మెంట్ ప్రకారం కొల్లేరు నిషేధిత ప్రాంతంలో అక్రమంగా, చట్ట విరుద్ధంగా తవ్విన చేపల చెరువులను వెంటనే ధ్వంసం చేయాలని రోనాల్డ్ రాజు ఆ ఫిర్యాదులో కోరారు. కొల్లేరులో అక్రమంగా చేపల చెరువులు తవ్వకుండా అడ్డుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, కొల్లేరు ప్రాంతాల కలెక్టర్లను కోరారు. లేకుంటే హైకోర్టులో కేసు వేసి విచారణ కోరుతామని న్యాయవాది రోనాల్డ్ రాజు పేర్కొన్నారు. దీంతో ఏలూరు ఆర్‌డిఒ ఎన్ఎస్ కె.ఖాజావలి ఏలూరు, కైకలూరు, మండవల్లి తహశీల్దార్లకు తగిన చర్యలు తీసుకోవాలని, నివేదిక సమర్పించాలని కోరారు. దీంతో స్పందించిన ప్రభుత్వాధికారులు ఆక్రమణలు తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు.

100 మందికి విశిష్ట మహిళా పురస్కారం

ఏలూరు టౌన్ : మార్గరేట్ ఆలివ్ గోల్డింగ్ అనే నర్స్ స్థాపించిన 'ఇన్నర్ వీల్ క్లబ్' స్నేహం, సేవ ధ్యేయంగా మహిళలచే నిర్వహించబడుతూ, అంతర్జాతీయ సేవా సంస్థగా విరజిల్లుతూ, 100వ సంవత్సరం లోకి అడుగు పెట్టిన సందర్భంగా ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ ఏలూరు వారు శత వసంతాల వేడుకలో వందమంది సేవామూర్తులైన మహిళలకు 'విశిష్ట మహిళా పురస్కారం'తో ఘనంగా సత్కరించారు. ఈ సత్కారంలో మేయర్ షేక్ నూర్జహాన్, మున్సిపల్ ఛైర్‌పర్సన్ జి.పద్మశ్రీ, డాక్టర్లు, లాయర్లు, లెక్చరర్లు, టీచర్లు, వివిధ సంస్థల అధ్యక్షులైన మహిళలు, మున్సిపల్ ఉద్యోగులు మొదలైన 100 మంది మహిళలను ఘనంగా సత్కరించారు. అత్యంత ప్రతిష్టాత్మకంగా జరిగిన ఈ సత్కార సహిత శతవసంతాల వేడుకలో ఏలూరు క్లబ్ మెంబర్, ఇంటర్‌నేషనల్ ఇన్నర్ వీల్ ట్రెజరర్ సరితలునాని, క్లబ్స్ డిస్ట్రిక్ట్ ఛైర్మన్ జి.శ్రీదేవి, పాస్ట్ డిస్ట్రిక్ట్ ఛైర్మన్‌లు, ప్రాజెక్టు కన్వీనర్ డాక్టర్ పి.సుబ్బలక్ష్మి, క్లబ్ ప్రెసిడెంట్ పిఎస్.లక్ష్మి, సెక్రెటరీ జి.అచ్యుత, క్లబ్ పాస్ట్ ప్రెసిడెంట్‌లు, డిస్ట్రిక్ట్ మెంబర్లు, క్లబ్ మెంబర్లు పాల్గొన్నారు. అనంతరం క్లబ్‌కు ఛైర్మన్ అఫిషియల్ విజిట్ చేసి కొన్ని సర్వీస్ ప్రాజెక్ట్స్ చేశారు. బ్రాండింగ్ ఇన్నర్ వీల్‌లో భాగంగా ఇన్నర్ వీల్ పోల్ శాతవాహన నగర్‌లో ఏర్పాటు చేశారు. విద్యార్థినులకు సైకిళ్లు, స్మార్త వేద పాఠశాలలో విద్యార్థుల కోసం ఫ్యాన్లు, స్కూల్‌కి గేమ్స్ ఐటమ్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రెసిడెంట్, సెక్రెటరీ పాల్గొన్నారు.



పురస్కారం అందుకుంటున్న మేయర్ నూర్జహాన్

బాణసంచా తయారీ కేంద్రాల్లో తనిఖీలు

ఏలూరు : నిడమర్రు మండలం భువనపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన బాణాసంచా దుకాణాలను, తయారీ కేంద్రాలను ఎస్‌పి డి.మేరీ ప్రశాంతి ఆదేశాలపై ఏలూరు డిఎస్‌పి ఇ.శ్రీనివాసులు, నిడమర్రు సిఐ ఎం.సుభాష్ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ప్రభుత్వం నిర్ణయించిన ప్రమాణాలు పాటిస్తున్నారా లేదా అని పరిశీలించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ బాణాసంచా తయారీదారులు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా తగిన జాగ్రత్తలను తీసుకోవాలన్నారు. బాణాసంచా తయారీ కేంద్రాలు, విక్రయ కేంద్రాల్లో 18 సంవత్సరాలు లోపు పిల్లలను ఉపయోగించరాదన్నారు. అక్రమ బాణాసంచా తయారీదారులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సదరు సమాచారం పోలీస్ వారికి తెలియజేసిన యెడల సమాచారం అందించిన వారి యొక్క వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

సామాజిక చైతన్యంపై అవగాహన

జంగారెడ్డిగూడెం : విద్యార్థులు విద్యార్థి దశ నుంచి సామాజిక చైతన్యం కలిగి ఉండాలని కొయ్యలగూడెం ఎఎస్‌డబ్ల్యూఒ సంకురయ్య తెలిపారు. ఆదివారం స్థానిక గాయత్రి ఒకేషనల్ కళాశాలలో కళాశాల వసతి గృహ విద్యార్థులు, జంగారెడ్డిగూడెం సాంఘిక సంక్షేమ శాఖ వారి ఆధ్వర్యంలో నిర్వహించ బడుచున్న కళాశాల విద్యార్థులకు భవిషత్ కార్యాచరణ ప్రణాళిక, చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సుంకరయ్య మాట్లాడుతూ విద్యార్థులు సత్ప్రవర్తన కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గాయత్రి కళాశాల డైరెక్టర్ ఆర్.ఉదిరాజు, ఎమ్‌డీ నజ్మ, మహిళ సమైక్య కార్యదర్శి పాల్గొన్నారు.